రాధేశ్యామ.. యదునందనా..

బృందావన విహారి.. యదు నందనుడి జన్మాష్టమి వేళ ఊరూవాడా వేడుకలు వైభవంగా జరిగాయి. గోపికా కృష్ణుల వేషధారణలో చిన్నారులు ముద్దుగొలిపారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, మహిళల కోలాటాలు, ఉట్టి సంబరాలతో అంతటా సందడి నెలకొంది.

- ఇంటింటా కొలువుదీరిన బృందావన విహారి
- రెండోరోజు వైభవంగా కృష్ణాష్టమి వేడుక



పంచవటిలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



పాత అగనంపూడిలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు



శ్రీనగర్‌లోని గోవర్ధనగిరిలో శ్రీకృష్ణుడిని దర్శించుకుంటున్న దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ రాజాన రామారావు



ఎస్టీబీఎల్‌లో ఉట్టి కొడుతున్న చిన్ని కృష్ణులు

గాజువాక: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నియోజకవర్గంలో రెండో రోజు కూడా ఘనంగా నిర్వహించారు. గాజువాక మెయిన్ రోడ్‌లోని వేణుగోపాల స్వామి ఆలయంలో రాధాకృష్ణులను ప్రత్యేకంగా అలంకరించారు. కార్పొరేటర్ ఉరుకూటి చందు, ఆలయ కమిటీ చైర్మన్ ఉరుకూటి అప్పారావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఎస్టీబీఎల్‌లో శ్రీకృష్ణుడిగా తిరుమల బాలాజీ

కృష్ణాష్టమి వేడుకల్లో మేయర్ దంపతులు

పెదగంట్యాడ: 75వ వార్డు సీతానగరంలోని శ్రీకృష్ణ ఆలయంలో ముత్యమాంబ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, గొలగాని శ్రీను దంపతులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, వంశీకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- ముసలినాయుడు పాలెంలోని వంశీకృష్ణ దేవాలయంలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్లు పులి లక్ష్మీబాయి, ఉరుకూటి చందు, పల్లా శ్రీనివాసరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా చినతల్లి తదితరులు పాల్గొన్నారు.
- 74వ వార్డు పరిధిలోని కోనవానిపాలెంలో నిర్వహించిన వేడుకల్లో 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి పాల్గొన్నారు.
- 65వ వార్డు ప్రియదర్శిని కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు కృష్ణుడు, గోపిక వేషధారణల్లో అలరించారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. సాయంత్రం బాలాజీ తిరువీధి ఉత్సవాన్ని కనులపండువగా జరిపారు. అనంతరం శ్రీ కృష్ణుడు, గోపికల రూపధారణలో ఉన్న చిన్నారుల ఉట్టి సంబరం నిర్వహించారు.

- 68 వార్డు అక్కిరెడ్డిపాలెంవద్ద గల పంచవటిలో పంచవటి హౌస్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణులుగా చిన్నారులు అలరించారు. పోవా అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.
- తుంగ్లాంలో కోదండ రామాలయం వద్ద, అక్కిరెడ్డిపాలెం రామాలయం వద్ద సాయంత్రం ఉట్టి సంబరాలు నిర్వహించారు. కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి పాల్గొన్నారు.

అగనంపూడి: దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టి సంబరాలు నిర్వహించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, సీఈవో శ్రీకాంత్ విద్యార్థులతో పోటీ పడి ఉట్టి కొట్టారు.

- అగనంపూడిలోని జగన్నాథస్వామి ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే నాగిరెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఊయలలో కృష్ణుడికి తులసి మాలలతో పూజలు చేశారు. కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పూర్ణానందశర్మ, ఇల్లపు ప్రసాద్ పాల్గొన్నారు.
- అగనంపూడిలోని షిర్డీ సాయి మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు కనుల పండువగా జరిపించారు.
- 85వ వార్డు దిబ్బపాలెం నిర్వాసితకాలనీలోని కృష్ణమందిరంలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే నాగిరెడ్డి పాల్గొని పూజలు చేశారు.



ఓక్‌వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చిన్నారుల సందడి



సీతానగరంలో కృష్ణాష్టమి వేడుకల్లో మేయర్ హరి వెంకట కుమారి దంపతులు



ప్రియదర్శిని కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గోపికా కృష్ణులుగా చిన్నారులు



కోనవానిపాలెంలో శ్రీకృష్ణుడిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

క్లుప్తంగా

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 19లోగా iti.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించనున్న వెరిఫికేషన్‌కు హాజరు కావాలని సూచించారు. ఐటీఐలో ప్రవేశం కోసం ఈ నెల 22న ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. వివరాలకు 91773 91289 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఫిజియో థెరపీతో ఉపశమనం



డాక్టర్ అపర్ణ

అక్కిరెడ్డిపాలెం: మందులు లేకుండా కొన్ని రకాల జబ్బులను ఫిజియోథెరపీ ద్వారా నయం చేయవచ్చని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ అపర్ణ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శారీరక సమస్యలకు సంబంధించిన ఎన్నో దీర్ఘకాలిక జబ్బులను ఫిజియోథెరపీ ద్వారా తగ్గించవచ్చన్నారు. యువత ఇటీవల సెల్ ఫోన్లు, కంప్యూటర్ల వాడకంతో మెడ, నడుము, కండరాల నొప్పులతో బాధపడుతున్నారని, ఇటువంటి వారికి ఫిజియోథెరపీ ద్వారా ఉపశమనం లభిస్తుందని వివరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

పెదగంట్యాడ: ఆది ఆంధ్ర యువజన సంఘం నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. పెదగంట్యాడలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ అధ్యక్షునిగా మార్టుపూడి పరదేశి, అధ్యక్షునిగా మార్టుపూడి వెంకటేష్‌ను, ప్రధాన కార్యదర్శిగా పెద్దాడ వెంకటరమణను ఎన్నుకున్నారు. కోశాధికారిగా కణితి సురేష్, సభ్యులుగా 10 మంది ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ ప్రమాణస్వీకారం జరిగింది. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పెద్దాడ రాములు, శంకరరావు, టీకేటి నరసింగరావు, ఎల్లారావు, పెద్దాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట శిబిరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. కై లాష్‌నగర్‌లోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించి, ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.25 వేల నగదు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

పరవాడ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలకు హాజరవుతున్న స్థానిక బాలుర జెడ్పీ పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు స్టడీ మెటీరియల్ సమకూర్చారు. ఆ మెటీరియల్‌ను హెచ్ఎం బి.అప్పలనాయుడు చేతుల మీదుగా విద్యార్థులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. స్టడీ మెటీరియల్‌ను సమకూర్చిన ట్రస్ట్ ప్రతినిధులకు హెచ్ఎం అప్పలనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎ.రామస్వామి, జూరెడ్డి దిలీప్, ఉపాధ్యాయులు గోవిందు, టి.వి.సత్యనారాయణ, సీటర్‌పాల్, మంజుల, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రూ.90 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



సీసీ రోడ్లు, సామాజిక భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: నియోజకవర్గాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయడమే లక్ష్యంగా చేసుకున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 85వ వార్డు బొర్రమాంబ ఉప్పరకాలనీలో రూ.50లక్షలతో రక్షణ గోడ, కొండయ్యవలసలో రూ.20లక్షలతో సామాజిక భవనం, దొంకాడ కాలనీలో రూ.20లక్షలతో రక్షణ గోడ నిర్మాణానికి ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఇప్పటికే మరమ్మతులు పూర్తి చేశామని, కొత్త రహదారులు, డ్రైనేజీలు నిర్మించేందుకు నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గాజువాక జెడ్పీ పొందూరు సింహాచలం, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ ఇల్లపు ప్రసాద్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ, నాయకులు నక్కా రమణబాబు, గెద్దాడ సత్యవతి, దాసరి సత్యవేణి, బలిరెడ్డి శ్రీను, యలమంచిలి అప్పారావు, దానబాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎల్ అండ్ టీ డీజీఎం శ్రీనివాసరావు

అగనంపూడి: ఎదుగుతున్న బాలలు సమతుల ఆహారాన్ని తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఎల్ అండ్ టీ సీఎస్ఆర్ విభాగం డీజీఎం శ్రీనివాసరావు అన్నారు. ఫిట్‌నెస్‌తో ఉన్న విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించగలరన్నారు. కిశోర బాలికల్లో రక్తహీనత నిరోధక కార్యక్రమం పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఎల్ అండ్ టీ, సృజన సంస్థలు సంయుక్తంగా అగనంపూడి పాఠశాలల విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాయి. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ప్రసాద్, కృష్ణవేణి, సృజన సంస్థ ప్రతినిధి హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణపై పెరుగుతున్న వ్యతిరేకత



దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ప్రజామోదం లేదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతే ఇందుకు నిదర్శనమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 938వ రోజు గురువారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోందని, అన్ని పరిశ్రమల వద్ద దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని పార్లమెంట్‌లో ప్రకటన చేసే వరకు తమ ఆందోళనలు ఆగవన్నారు. కార్మికులను చిన్నచూపు చూసిన ఎన్నో రాజకీయ పార్టీలు ఇప్పటికే దీనస్థితిలో ఉన్నాయని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

రాజశేఖర్‌కు ఎంపీ ఎంవీవీ పరామర్శ



రాజశేఖర్‌ను పరామర్శిస్తున్న ఎంపీ ఎంవీవీ

ఉక్కునగరం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్టీల్ ప్లాంట్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్‌ను విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ గురువారం పరామర్శించారు. ఆస్పత్రిలో ఆయన్ను కలిసి, యోగక్షేమాలు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన పలు కార్మిక సంఘాల నాయకులు కూడా రాజశేఖర్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు.

శిష్టకరణాల అసోసియేషన్ నాయకుల పరామర్శ

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం శిష్టకరణాల అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి రాజశేఖర్‌ను గురువారం అపోలో ఆస్పత్రిలో పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాజశేఖర్‌ను పరామర్శించిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు డి.సత్యారావు, పీఎస్‌వీఎన్ గోపాల్, గర్భం నాగేశ్వరరావు, డి.కృష్ణ, కార్మిక నాయకులు, ఉక్కు ఉద్యోగులు తదితరులున్నారు.

మహా గణపతి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి అన్నపూర్ణానగర్‌లో నిర్మిస్తున్న పూర్ణ మహాగణపతి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మనిషి యాంత్రిక జీవనంలో అనేక ఒత్తిళ్లకు గురవుతున్నాడని, వాటి నుంచి ఉపశమనం కోసం ఆధ్యాత్మిక చింతన అవసరమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్ దంపతులు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పూర్ణానందశర్మ, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు కె.విశ్వనాథ్, నాయకులు గుర్రం శ్రీను, గురు త్రినాథ్, మోహన్, జెర్రిపోతుల సమర తదితరులు పాల్గొన్నారు.

సింహగిరీశుడికి స్వర్ణ పుష్పార్చన



స్వర్ణపుష్పార్చన నిర్వహిస్తున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు

సింహాచలం: సింహగిరీశుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన నేత్రపర్వంగా జరిపించారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడామండపంలోని వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- ఎమ్మెల్యే నాగిరెడ్డి వెల్లడి
- 1189 మందికి కొత్త పింఛన్ల పంపిణీ



లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



సభకు హాజరైన లబ్ధిదారులు, ప్రజలు

గాజువాక: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే చెందుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన 1189 పింఛన్లను లబ్ధిదారులకు గురువారం ఆయన పంపిణీ చేశారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ పథకమైనా అమలు చేసేందుకు కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా కేవలం అర్హతను మాత్రమే పరిగణనలోకి తీసుకొంటున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ నగదును ఏటేటా పెంచుకుంటూ వచ్చారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో తమ ఉనికిని కోల్పోతున్న ప్రతిపక్షాలు లేనిపోని అసత్యాలను ప్రచారం చేస్తున్నాయని, వాటిని నమ్మవద్దని పేర్కొన్నారు. అన్ని వర్గాలకు మరిన్ని ప్రయోజనాలను చేకూర్చడం కోసం జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మరోసారి దీవించాలని కోరారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, ఏపీడీ ఎల్.రాము, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు రాజాన రామారావు, ఎ.జె.స్టాలిన్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, సభ్యులు బోగాది సన్ని, పూర్ణానందశర్మ, దొడ్డి రమణ, పల్లా చినతల్లి, వివిధ వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి ఓటర్ల పరిశీలనపై సమీక్ష

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలోని సుబ్బలక్ష్మీ కల్యాణ మండపంలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్(ఆర్డీవో) హుస్సేన్ సాహెబ్ గురువారం జీవీఎంసీ జోన్-5 పరిధి పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. బీఎల్‌వో యాప్‌లో ఇంటింటి ఓటర్ల పరిశీలన, నమోదు, ఫారమ్స్ డిజిటలైజేషన్ వంటి అంశాలపై ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో జోన్-5 కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, జోన్-8 కమిషనర్ మల్లయ్యనాయుడు, గోపాలపట్నం తహసీల్దార్, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్‌వోలు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సమాచారం

విచారణ ప్రక్రియపై అధికారులకు శిక్షణ



సదస్సులో ప్రసంగిస్తున్న మిథానీ సీవీవో డాక్టర్ ఉపేందర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్ సదస్సు నిర్వహించారు. మూడు నెలల విజిలెన్స్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉక్కు హెచ్ఆర్‌డీ సెంటర్‌లో సీవీసీ మార్గదర్శకాల ప్రకారం 'క్రమశిక్షణ చర్యల్లో రోల్ ఆఫ్ ఎంక్వైరీ ఆఫీసర్, ప్రజెంటింగ్ ఆఫీసర్' అనే అంశంపై మిథానీ లిమిటెడ్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సీవీఓ) డాక్టర్ ఉపేందర్ వెన్నం ముఖ్యవక్తగా ప్రసంగించారు. విచారణ ప్రక్రియలో ఎంక్వైరీ ఆఫీసర్, ప్రజెంటింగ్ ఆఫీసర్ యొక్క బాధ్యతలు, జరిమానాలు, విచారణ కోసం కమిటీ యొక్క రాజ్యాంగం, వివిధ నివేదికల కోసం ఫార్మాట్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ సీజీఎం జి.గాంధీ మాట్లాడుతూ ఉక్కు అధికారులకు ఇది చాలా ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ జీఎంలు కె.వేణు, వి.జి.మహీధర్, హెచ్ఆర్‌డీ జీఎం టి.కె.ఎస్.ఆర్.ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనతకు చెక్

అగనంపూడి: పోషకాహారంతో రక్తహీనత లోపం నివారించవచ్చని దువ్వాడ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అన్నారు. విజ్ఞాన్ ఫార్మా కళాశాల ఆధ్వర్యంలో కాపు జగ్గరాజుపేటలో జాతీయ పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే లక్ష్యాలను చేరుకోగలరన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో సత్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

కూర్మన్నపాలెం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను దువ్వాడ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంజాయి తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో దువ్వాడ పోలీసులు దువ్వాడ రైల్వేస్టేషన్ రహదారి లక్కరాజుపాలెం వద్ద కాపు కాశారు. రెండు వేర్వేరు ద్విచక్రవాహనాలపై వస్తున్న గాజువాకకు చెందిన గురు సాయికుమార్, దువ్వాడకు చెందిన గంధవరపు తరుణ్‌లను అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారివద్ద 20 కిలోల గంజాయిని గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.